క్లుప్తంగా

గిరిజన అధ్యాపకులకు చోటు కల్పించాలి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్‌ను అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం (ఏఐఎస్‌టీఏ) నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. బుధవారం వైవీయూలో వీసీని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏఐఎస్‌టీఏ నాయకులు మాట్లాడుతూ వైవీయూ పాలకమండలిలో ఎస్.టి. అధ్యాపకులకు అవకాశం కల్పించాలని కోరారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రశేకర్, సంయుక్త కార్యదర్శి డా. పి. రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రమణయ్య పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన బీజేపీ ప్రభుత్వం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరానగర్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రానికి సంజీవిని లాంటి ప్రత్యేకహోదాకు పంగనామాలు పెట్టిందన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయకుండా, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలు ఇవ్వకుండా తిలోదకాలు ఇచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు, విశాఖ రైల్వేజోన్ ప్రస్తావనే లేకపోవడం దారుణమన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ప్రజల మనసు గెలిచిందన్నారు. కాంగ్రెస్ నాయకులు చెప్పలి పుల్లయ్య, వంశీ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గోశాల ప్రారంభం



గోశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్, కమిషనర్

చింతకొమ్మదిన్నె : 17వ డివిజన్ బుగ్గ అగ్రహారంలో ఏర్పాటు చేసిన గోశాలను బుధవారం కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో దాదాపు రూ.36 లక్షలతో ఈ గోశాలను నిర్మించారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ కె. సురేష్‌బాబు, డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, నగర కమిషనర్ ప్రవీణ్‌కుమార్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదులు

వైవీయూ : ప్రొద్దుటూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం నిబంధనలు విరుద్ధంగా పాఠశాలలను నడుపుతోందని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ డీఈఓ వై.రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. బుధవారం డీఈఓను కలిసి వినతిపత్రం అందజేశారు.

- అదే విధంగా ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న తొండూరు మండల పరిధిలోని ఓ స్కూల్ అసిస్టెంట్‌పై చర్యలు చేపట్టాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు డీఈఓ వై.రాఘవ రెడ్డికి ఫిర్యాదు చేశారు.
- నగరంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాల ఎటువంటి మౌలిక సదుపాయాలు లేకుండా కళాశాల నిర్వహిస్తోందని ఏబీవీపీ నాయకులు ఆర్ఐఓ రమణరాజుకు ఫిర్యాదు చేశారు. ల్యాబ్‌లు, గ్రౌండ్, కనీస మౌలిక సదుపాయాలు లేవని ఏబీవీపీ నాయకులు మంజునాథరెడ్డి, వంశీకృష్ణ, హరి ఫిర్యాదు చేశారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన పత్తి

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన చెన్నుపల్లెరామిరెడ్డికి చెందిన సుమారు 20 క్వింటాళ్ళ పత్తి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయింది. రామిరెడ్డి తనకున్న 7 ఎకరాల పొలంలో పత్తిపంటను సాగు చేసి 6 నెలలుగా శ్రమించి కూలీలతో పత్తిని సేకరించి తన పొలంలో ఉన్న గోడౌన్‌లో నిల్వ ఉంచారు. బుధవారం సాయంత్రం వీచిన గాలికి గోడౌన్‌లోని విద్యుత్ బోర్డు షార్ట్‌సర్క్యూట్ జరిగి అక్కడే నిల్వ ఉన్న పత్తి మీద నిప్పురవ్వలు పడి అంటుకుంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గోడౌన్ నుండి పొగ వస్తుండటాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల వారు రామిరెడ్డికి తెలియజేయడంతో తోటి రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా పత్తి పొగసూచిగా మారడంతో మార్కెట్ చేసేందుకు పనికిరాకుండా పోయింది. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామిరెడ్డి వాపోయాడు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

రక్తపోటుపై అవగాహన పెంచుకోవాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : జీవనశైలి వ్యాధులలో ఒకటైన రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ డి.నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పలు సూచనలు చేశారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



హౌసింగ్‌పై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థ పరిధిలో ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో చేపట్టిన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల వద్ద మౌళిక వసతుల కల్పన దాదాపు పూర్తయ్యిందన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులందరికీ బ్యాంకు రుణాలను మంజూరు చేయాలని బ్యాంకు అధికారులకు, మెప్మా సిబ్బందికి సూచించారు. మెప్మా సీఓలు లబ్ధిదారుల డాక్యుమెంటేషన్‌ను నెలాఖరుకల్లా పూర్తి చేసి సంబంధిత బ్యాంకులకు అందజేయాలన్నారు. తద్వారా రుణాలను త్వరగా ఇప్పించేందుకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ వై. సురేష్ రెడ్డి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ రాజేంద్రకుమార్, యుబీఆర్ఐఎం బి. భాస్కర్, కెనరా బ్యాంక్ డిప్యూటీ ఆర్ఎం ఏపీ రాజశేఖర్, ఏపీజీబీ ఆర్ఎం శ్రీదేవి, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ అరుణ్‌కిరణ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అమర్, ఏపీ టిడ్కో డీఈ రత్నరాజు, సీఎల్‌డీసీ శ్రీనాథ్, డీసీఓ నారాయణరెడ్డి, సీఎంఎం హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సబ్‌జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన క్రీడాపాఠశాల క్రీడాకారులు



ఏపీ వాలీబాల్ జట్టులో జిల్లా క్రీడాకారిణులు

కడప స్పోర్ట్స్: ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం చందర్ నగర్‌లో నిర్వహించనున్న 45వ సబ్‌జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 13, 14 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టులో చోటు సంపాదించారు. కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన టి. పావని, ఎన్. గాయత్రి, ఎస్. రుచిత, జి. శ్రీలక్ష్మి, జె. కుముదినిదేవి బాలికల జట్టుకు ఎంపికకాగా, రాజంపేటకు చెందిన సాయి ప్రతాప్ బాలుర విభాగంలో ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల18 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్యాంపులో పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి ఖాదర్‌వల్లి పేర్కొన్నారు.

హాకీ సబ్‌జూనియర్ నేషనల్స్‌కు...

ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌కు కడప క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నుంచి ఏకంగా 5గురు ఎంపిక కావడం విశేషం. క్రీడాపాఠశాలకు చెందిన క్రీడాకారులు కె.చరణ్‌కుమార్, జి.చందు, ఎం.శ్రీనివాస్, ఎస్.మహమ్మద్, డి. దేవసాయియాదవ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్, హాకీ శిక్షకులు అనిల్‌కుమార్, ఖాదర్‌బాషా అభినందనలు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చెన్నూరు : మండల పరిధిలోని రామనపల్లి గ్రామపంచాయతీ మొడాలు గ్రామానికి సమీపంలో నున్న స్మశాననానికి వెనుక వైపున బుధవారం జూదమాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారిని నుంచి రూ.2010 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప కలెక్టరేట్‌కు సమీపంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. ఈ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంకు సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు కలవని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు ప్రారంభమవుతాయని ఆమె వివరించారు.

రోడ్డుకు అడ్డంగా.. పూడిక



చిన్నచౌకులో మానస కళ్యాణ మండపం ఎదురుగా రోడ్డుపై వేసిన పూడిక

కడప కార్పొరేషన్: చిన్నచౌకులో అశోక్ నగర్ నుంచి మానస కళ్యాణ మండపం వరకూ డ్రైనేజీ కాలువలో పూడిక తీసి రోడ్డుపై వేశారు. వారం రోజుల క్రితం తీసిన ఈ పూడిక ఎండిపోయింది. పూడిక మట్టి, కాలువలపై వేసిన బండలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్రమైన ఎండలకు పూడిక ఎండిపోయి వాహనాలు వెళ్లినప్పుడల్లా దుమ్ము రేగి పాదచారులు, వాహనదారుల కళ్లలో పడుతోంది. వెంటనే ఈ పూడికను ఎత్తివేయాలని ప్రజలు కోరుతున్నారు.

పుస్తక పఠనం అలవరచుకోండి

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వేసవిలో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవరచు కోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్, కథల పుస్తకాలు చదవడం, నీతి కథలు చదవడంలో శిక్షణ నిచ్చారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

కమలాపురం : పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా జగనన్న ప్రభుత్వ పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దచెప్పలిలో రెండో రోజు సర్పంచ్ నామాల చంద్రలీలశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం వారికి అందిస్తున్న పథకాలను, వాటిద్వారా పొందిన లబ్ధిని వివరించారు. మంచి నీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, డ్రైనేజ్, సీసీ రోడ్లు తదితర సౌకర్యాలు కావాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు చెబుతున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ ఒక్క కుటుంబం ఇబ్బంది పడకూడదని భావించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాక ఇవ్వని అనేక పథకాలను ప్రవేశ పెట్టిన ఘనత ఒక్క సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

1902 డయల్ చేయండి...

ప్రజా ఫిర్యాదులకు సత్వర పరిష్కారం చూపడమే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్నకు చెబుదాం... అనే కార్యక్రమాన్ని వినూత్నంగా ప్రారంభించిందని, 1902కు డయల్ చేసి తమ సమస్యలు సీఎంకు వివరించవచ్చని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పెద్దచెప్పలి చిన్ని, నామాల శేఖర్, మర్రి సుబ్బన్న, చంద్రపాల్, చంటి, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, యూ. ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్ రెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, హిదాయత్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, మహ్మద్ సాదిక్, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్ అన్ని శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వారసత్వ సంపదకు కరువైన రక్షణ

- శిథిలస్థితిలో మ్యూజియం భవనాలు
- నేడు అంతర్జాతీయ మ్యూజియం డే



కడపలోని మహావీర్ మ్యూజియం



మహావీర్ మ్యూజియం ప్రధాన హాలు

కడప కల్చరల్ : నేడు మనకు కనిపిస్తున్న చారిత్రక వారసత్వ సంపద మన పూర్వీకులు మనకు అందించిన ఎంతో విలువైన సంపద. దాన్ని రక్షించుకునేందుకే ప్రభుత్వాలు మ్యూజియంలను ఏర్పాటు చేశాయి. ప్రతి ఏడాది మే నెల 18వ తేదిన అంతర్జాతీయ మ్యూజియం డే నిర్వహిస్తారు. రాష్ట్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో కడప, మైలవరంలలో మ్యూజియంలు ఉన్నాయి. జిల్లాలోని నలుమూలల తవ్వకాలలో బయల్పడిన, విలువైన శిల్పాలు, శాసనాలను కడప నగరంలోని మహావీర్ మ్యూజియంలో చూడవచ్చు. అలాగే మైలవరం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తవ్వకాలలో లభించిన శిల్పాలు, శాసనాలతోపాటు అరుదైన చారిత్రక సంపదను మైలవరం ప్రాజెక్టు సమీపంలో మ్యూజియం ఏర్పాటు చేసి అందులో ఉంచారు. భారీ సైజు వండాడి శాసనం నుంచి చిన్న శాసనాలు కూడా ఇందులో ఉన్నాయి.

శిథిలమైన మ్యూజియం భవనం

పురావస్తు సంపదను శిథిలం కాకుండా కాపాడుకునేందుకు మ్యూజియంలను ఏర్పాటు చేశారు. కానీ మ్యూజియం భవనాలే నానాటికి శిథిలమై నేడో, రేపో కూలేటట్లు ఉన్నాయి. అందులోని అపురూపమైన శిల్పాలు, శాసనాలకు ఇలాంటి భవనాల్లో ఏమాత్రం రక్షణ ఉండదు. దీంతో మ్యూజియంల ఏర్పాటు లక్ష్యం దెబ్బతింటోంది. కడప నగరంలోని కలెక్టరేట్ ఆవరణంలో 1982 జూన్ 8న భగవాన్ మహావీర్ మ్యూజియం పేరిట పురావస్తు సందర్శనశాలను ఏర్పాటు చేశారు. స్థానిక జైన సంఘాల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ భవనంలో జిల్లా నలుమూలల లభించిన అత్యంత విలువైన శిల్పాలు, శాసనాలు తదితర చారిత్రక వారసత్వ సంపదను ఉంచారు. ఏర్పాటు చేసి 41 సంవత్సరాలైనా ఇంతవరకు ఈ భవనాన్ని కాలానుగుణంగా ఆధునీకరించలేదు. దీంతో శిల్పాలను నిలిపిన పెడస్టల్స్ కూలిపోయి శిల్పాలు కిందపడి ముక్కలయ్యే ప్రమాదానికి చేరుకున్నాయి. తమ ప్రాంతాలలో లభించిన శిల్పాలు, శాసనాలను ఆ ప్రాంత ప్రజలు కష్టనష్టాలకు ఓర్చి మ్యూజియంకు చేరుస్తున్నారు. కానీ ఇందులో వాటికి స్థలం లేకపోవడంతో మ్యూజియం బయట ముళ్ల కంపల్లోనూ, మ్యూజియం భవన శిథిలాలలో పడేసి ఉంచారు.

విలువైన సంపద

మ్యూజియంలో రాజుల వాడిన కత్తులు, నాణెలు, పురాతన వస్తువులు, ఈ ప్రాంతంలో బౌద్ధం, జైనం విలసిల్లిందనడానికి గుర్తుగా బుద్ధిని పాదాలు, జైన సంస్కృతిని తెలిపే శిల్పాలు కూడా ఉన్నాయి. వీటి రక్షణ కోసం ఏర్పాటు చేసిన మహావీర్ మ్యూజియం భవనం నేడు శిథిల స్థితికి చేరుకుంది. నిజానికి ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు మ్యూజియంను తెరిచి ఉంచినా నెలకు పట్టుమని 30 మంది కూడా వస్తున్న దాఖలాలు లేవు.

రూ. 10 కోట్లతో కొత్త భవనం

కడప మహావీర్ మ్యూజియంను పునరుద్ధరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10కోట్ల రూపాయలతో డీపీఆర్ సిద్ధం చేసింది. అనుమతులు లభించగానే నిర్మాణం ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. దీంతో పాటు మైలవరం మ్యూజియంను కూడా పునర్నిర్మించాలన్న డిమాండ్ కూడా ఉంది. ప్రభుత్వం దీన్ని పరిశీలించి నిధులు ఇచ్చే అవకాశం ఉంది.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి సామగ్రి వితరణ

చెన్నూరు : చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు రూ.12.50 లక్షల విలువ కలిగిన సామగ్రిని వితరణ చేసినట్లు సామాజిక కేంద్ర వైద్యులు డాక్టర్.సతీష్‌కుమార్, డాక్టర్ దినకర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోకి వచ్చే ప్రజలకు, రోగులకు ఐసీయూ బెడ్లు-5, వీల్ చైర్స్-5, ఇన్స్ట్రుమెంట్ ట్యాలీలు-10, ఈసీజీ పరికరాలు-2, డెలివరీ బెడ్-1, ఎల్ఈడీ ఓటీ లైట్-1 ఇవ్వడం జరిగిందన్నారు. వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్లు టీ.ఓబయ్య, నాగార్జునరావు, వైద్యులు సాగరకుమారి, రామ్మూర్తి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ లే ఔట్‌లో నివాసం ఉంటున్న కొప్పర్తి కుమరమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ శ్రీరామశ్రీనివాసులు, తమ సిబ్బందితో కలిసి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితురాలి వద్ద నుంచి 28 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేసినట్లు సీఐ తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితురాలిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మహిళా పోలీస్ సిబ్బంది, పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

పులివెందుల రూరల్ : నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చునని జిల్లా పరిశ్రమల అధికారిణి భువనేశ్వరి తెలిపారు. బుధవారం పులివెందులలో పులివెందుల, లింగాల, తొండూరు ఐటీఐ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐటీఐ కోర్సులు పూర్తైన తర్వాత ఇంజనీరింగ్ కోర్సులకు ఎంతో దోహదపడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి ఉంటే అవకాశాలు కూడా పొందవచ్చునన్నారు. పరిశ్రమలు ఎలా స్థాపించాలనే దానిపై అవగాహన కల్పించారు. స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా దేశంలో 33 శాతం యువత ఉన్నారన్నారు. యువత కోసం ప్రభుత్వ విద్యా సంస్థలలో భాగమైన వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చి.. దీని ద్వారా యువత చెడు మార్గంలో పయనించకుండా అవగాహన కల్పిస్తామని వివరించారు.

ఆరోగ్యంపై ఆహారం ప్రభావం ఎక్కువే



తాము గీసిన చిత్రాలతో విద్యార్థులు

కడప కల్చరల్ : మనం రోజు వారీగా తీసుకుంటున్న ఆహారం ప్రభావం ఆరోగ్యంపై ప్రధానంగా ప్రభావం చూపుతుందని సీవీ రామన్ సైన్స్‌క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో కడప నగరం కొండాయపల్లెలో గల ప్రధాన కార్యాలయంలో విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నారు. 10వ రోజు బుధవారం శ్రీనివాసులరెడ్డి ఆహారం – ఆరోగ్యం అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యక్తి జీవన శైలిలో నేటి కాలానుగుణంగా చేసుకోవాల్సిన మార్పుల గురించి, గుండె సంబంధిత జబ్బులు, నివారణోపాయాల గురించి ఆకర్షణీయమైన చిత్రాల ద్వారా వివరించారు. విద్యార్థులలో గుండె సంబంధిత బొమ్మలను గీయించి వాటికి తగినట్లు నినాదాలు రాయించి పలికించారు. అనంతరం క్రాఫ్ట్, నృత్యం, కథల పఠనం తదితర అంశాలపై కూడా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



హ్యాండ్‌బాల్ శిక్షణలో క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : మైదానంలో చిరుతలా.. చురుగ్గా మెదులుతూ.. కరములను వేగంగా కదుపుతూ బంతిని అందిపుచ్చుకుని ప్రత్యర్థిని తికమక పెట్టి నేర్పుగా గోల్‌చేసి పాయింట్‌లు సాధించే ఫుల్‌జోష్ ఉన్న క్రీడ హ్యాండ్‌బాల్.. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా నిర్వహిస్తున్న హ్యాండ్ బాల్ శిక్షణకు చిన్నారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది. ఇండోర్ మైదానంలోను, అవుట్‌డోర్ మైదానంలోను ఆడగలిగే చక్కటి క్రీడ హ్యాండ్‌బాల్. దేహధారుడ్యాన్ని మేధాశక్తిని పెంపొందించే క్రీడగా దీనికి గుర్తింపు ఉంది. కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో శాప్ ఆధ్వర్యంలో శిక్షకుడు అబ్దుల్ మునాఫ్ పర్యవేక్షణలో హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. ఈ క్రీడను సాధన చేయడం ద్వారా క్రీడాకారుల్లో చురుకుదనం, వేగం వృద్ధి చెందుతాయన్నది నిపుణుల మాట. మొత్తం జట్టులో 12 మంది క్రీడాకారులు ఉంటారు. అయితే తుది జట్టులో ఆటకు దిగే క్రీడాకారులు 7 మంది మాత్రమే. 30 నిమిషాలు చొప్పున రెండు సెషన్‌లుగా ఆట 60 నిమిషాలు సాగుతుంది.

అన్ని అంశాల్లో శిక్షణ అందిస్తున్నాం..

శిక్షణకు వచ్చే చిన్నారులకు హ్యాండ్‌బాల్ క్రీడ గురించి తెలియజేస్తున్నాం. ఆటలోని ప్రాథమిక అంశాలతో పాటు నైపుణ్యాలను నేర్పుతున్నాం. చిన్నారుల ఫిట్‌నెస్ కోసం తొలుత వ్యాయామం చేయించడంతో పాటు ఆటలోని అంశాలైన క్యాచింగ్, పాసింగ్, డ్రిబ్లింగ్, 3 స్టెప్ జంప్‌షాట్ తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నాం. ఈ శిక్షణకు క్రీడాకారులు పెద్ద సంఖ్యలో హాజరవుతుండటం సంతోషంగా ఉంది.

– అబ్దుల్ మునాఫ్, హ్యాండ్‌బాల్ శిక్షకుడు, డీఎస్ఏ

నిరంతర నిఘాతో నేరాలకు అడ్డుకట్ట

- కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్



కమాండ్ కంట్రోల్ సిబ్బందికి సూచనలు చేస్తున్న కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్: నేరాలు జరుగకుండా పోలీసుశాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని... నిఘాతో నేరాలకు అడ్డుకట్ట వేయగలమని కడప డీఎస్పీ ఎం.డి. షరీఫ్ పేర్కొన్నారు. కడప డీఎస్పీ కార్యాలయంలో బుధవారం రాత్రి పోలీస్ కమాండ్ కంట్రోల్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాత్రి వేళల్లో కమాండ్ కంట్రోల్ సిబ్బంది విధుల్లో ఎటువంటి లోపాలు ఉండకూడదనీ నిరంతరంగా పర్యవేక్షిస్తూనే ఉండాలనీ తెలిపారు. పోలీస్‌శాఖ గస్తీ ద్వారా చేపట్టిన చర్యలతోనే ఎలాంటి నేరాలు జరుగకుండా ప్రజలు భరోసాతో ఉండగలరని తెలిపారు. ఎటువంటి సమాచారాన్ని అయినా పోలీస్‌స్టేషన్‌లకు అందించాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల భాగస్వామ్యాన్ని తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేందుకు యత్నం

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ, పి.పి.కుంటలో గోపవరం రెవెన్యూ పొలం 1622 సర్వే నెంబరు గల భూమిలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఎవరి మాటలో విని అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తహసీల్దారు దామోదర్‌రెడ్డి సీపీఎం నాయకులను, ప్రజలను హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికే నవరత్నాల్లో భాగంగా ఇళ్ళులేని ప్రతి పేదవాడికి ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఇళ్ళు కూడా నిర్మించి ఇస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇంకా అర్హత ఉండి ఇళ్ళు లేని వారు ఉంటే ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి స్థానికంగానే జగనన్న కాలనీలో స్థలాలు కేటాయిస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎవరో చెప్పిన మాటలు విని కేసుల్లో ఇరుక్కోకూడదని హెచ్చరించారు. వెంటనే ఇక్కడ నుండి ఖాళీ చేసి వెళ్లిపోవాలని తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్ హెచ్చరికలు జారీ చేశారు. అక్కడి నుంచి కదలకపోవడంతో తహసీల్దారు బద్వేలు ఆర్డీఓ వెంకటరమణకు సమాచారమిచ్చారు. వెంటనే సీపీఎం నాయకులపై బైండోవర్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో సీపీఎం నాయకులు ఖాదర్‌బాషా, నరసింహులు, అన్వేష్, శివకుమార్, కదిరయ్యలపై బండోవర్ కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

20న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో శ్రీపోలేరమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75 వేలు, మూడవ బహుమతిగా రూ.50 వేలు, అందజేయనున్నారు. 20వ తేదీ ఉదయం 7 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 8384106188 నెంబరును సంప్రదించాలని కోరారు.